స్థానికంపై ఫోకస్


మాడ్గుల గ్రామ పంచాయతీ భవనం

శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. చట్ట సభల ఎలెక్షన్లు అయిపోయాయి. ఇక మిగిలింది స్థానిక సంస్థల ఎన్నికలే. ఈ సమరంలో రాజకీయ పార్టీలు, పోటీ చేయాలనుకునే ఔత్సాహికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా యువత. గ్రామాలు, పట్టణాల్లో తమ ప్రాబల్యాన్ని పెంచుకునేలా ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్నారు.

మాడ్గుల: శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. కొన్ని నెలల క్రితం సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రజాసేవ, రాజకీయాలపై ఆసక్తి ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టారు. బరిలోకి దిగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ అంశంపై పల్లెల్లో రచ్చబండ వేదికగా చర్చలు జరుగుతున్నాయి. పలువురు పేర్లు సైతం వినబడుతుండటంతో.. ప్రజలు కూడా ఈ సారి సర్పంచ్ ఎన్నికల్లో ఎవరు నిలబడతారోనని ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామంటూ యువత సంకేతం ఇస్తోంది.

సామాజిక కార్యక్రమాల్లో..
రాజకీయ వారసులతో పాటు, అసలు ఎన్నడూ వారి పూర్వికుల్లో ప్రత్యక్ష రాజకీయాల్లో లేని వారి కుటుంబీకులు నేను సైతం అంటూ రాజకీయ అరంగేట్రం చేసేందుకు ముందుకు వస్తున్నారు. రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపడమే తరువాయిగా కుతూహలంగా ఉన్నారు. అందుకు ఇప్పటి నుంచే ప్రజల్లో తిరుగుతున్నారు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ.. అందరికీ అందుబాటులో ఉంటున్నారు. ఎవరింట ఎలాంటి కార్యక్రమం అయినా, ఎవరికి ఏ ఆపదా వచ్చినా ముందు వరుసలో ఉంటూ నోట్లో నాలుకలా మెదులుతున్నారు. నిన్న మొన్నటి వరకు పోటీ చేసేందుకు విముఖత చూపిన వారు కూడా.. నేనున్నానంటూ బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. సర్పంచ్ పదవికి పోటీ చేస్తే ఎలా ఉంటుందని రాజకీయ ఉద్దండులు, సీనియర్ల అభిప్రాయాలు అడిగి తెలుసుకుంటున్నారు.

రచ్చబండ వేదికగా కొనసాగుతున్న చర్చ
- ఎన్నికల బరిలో దిగేందుకు యువత ఆసక్తి
- సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానంపై దృష్టి
- ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి
- రిజర్వేషన్లపై కొనసాగుతున్న ఉత్కంఠ

గట్టి పోటీ తప్పదా..
మేజర్ గ్రామ పంచాయతీల్లో ఈ సారి టఫ్ ఫైట్ తప్పదన్న ప్రచారం జరుగుతోంది. ఇది వరకు ఎన్నడూ లేని విధంగా పోటీ చేసేందుకు యువత ముందుకు వస్తుండడంతో ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తలనొప్పి తప్పదంటూ పలువురు నేతలు అభిప్రాయపడుతున్నారు. పార్టీలకు అతీతంగా జరిగే ఎన్నికలు అయినప్పటికీ.. పరోక్ష మద్దతు ఎవరికి ఉంటుందోనన్న టెన్షన్ మాత్రం ఆయా పార్టీలను కలవరపెడుతోంది.

రిజర్వేషన్లు మారుస్తారా?

స్థానిక ఎన్నికల నేపథ్యంలో సీట్ల రిజర్వేషన్లపై విస్తృత చర్చ జరుగుతోంది. గత ఎన్నికల్లో అమలు చేసిన రిజర్వేషన్లనే రానున్న సర్పంచ్ ఎన్నికల్లో కొనసాగిస్తారా? లేక మరోసారి కొత్తగా రూపొందిస్తారా? అనేది తేలాల్సి ఉంది. ఇప్పుడున్న రిజర్వేషన్లను పెంచి తమకు అవకాశం ఇవ్వాలంటూ ఇప్పటికే కొన్ని సంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ.. ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ.. రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.


తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిలో వన భోజనం చేస్తున్న భక్తులు

కార్తీక వనభోజనాలు


ఆమనగల్లు: శివాలయ ఆవరణలో మహిళల వనభోజనాలు

ఆమనగల్లు: కార్తీక వనభోజనాలు ఘనంగా జరిగాయి. కార్తీకమాసం పురస్కరించుకుని కడ్తాల్ మండలం మైసిగండి శివాలయం ఆవరణలో ఆమనగల్లు పద్మశాలి సంఘం మహిళల ఆధ్వర్యంలో ఆదివారం ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయ ఆవరణలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. కార్తీక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుర్రం కరుణశ్రీ, వరలక్ష్మి, లక్ష్మి, సువర్ణ, దర్శిణి, శ్రీదేవి, సరిత, దివ్య, వనిత, చాముండేశ్వరీ తదితరులు ఉన్నారు.

గట్టుఇప్పలపల్లిలో..
తలకొండపల్లి: మండల పరిధి గట్టుఇప్పలపల్లిలో కార్తికమాసం వనభోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ శివాజీ శాఖ ఆధ్వర్యంలో ఉసిరిచెట్టు కింద అరిటాకులతో భోజనం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సహకార భారతి సహ కార్యవహ నాగిళ్ల కుమార్, ఆమనగల్లు సంఘ్ చాలక్ దొంతు విశ్వనాథం, అంజయ్య, యాదయ్య, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాటమయ్య పండుగ


స్వామివారిని దర్శించుకున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మండల పరిధి పోచారంలో కాటమయ్య పండగ ఘనంగా జరుగుతోంది. ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం స్వామి వారిని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, ఐఎస్ సదన్ మాజీ కార్పొరేట్ మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ కృపేష్‌లు దర్శించుకుని పూజలు చేశారు. మాజీ సర్పంచ్ ప్రభాకర్‌గౌడ్, నాయకులు రాజు, చిన్న, రమేష్, బుగ్గరాములు, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

నిర్వాహకుల నిర్లక్ష్యం.. ధాన్యం దళారుల పాలు

- తక్కువ ధర వచ్చినా ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్న రైతులు
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

యాచారం: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల నిర్లక్ష్యం, వారు పెట్టే ఇబ్బందుల వలన రైతులు ఇబ్బంది పడుతున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. దీంతో తక్కువ ధర వచ్చినా దళారులకు తమ దిగుబడిని విక్రయించేందుకు అన్నదాతలు మొగ్గుచూపుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాల పేరుతో నిర్వాహకులు రైతులను ఇక్కట్లకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో వేలాది క్వింటాళ్ల ధాన్యం దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతుగా ఉందని చెబుతూనే.. వారిని అన్ని విధాలా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. రైతుబంధు నిధులు జమ చేయకపోవడం, పూర్తి స్థాయిలో రుణమాఫీ కాకపోవడం వంటి విషయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారని విమర్శించారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సన్మానం


భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

కడ్తాల్: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన భాస్కర్‌రెడ్డిని.. భగత్‌సింగ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి మహేందర్, సభ్యులు అంజయ్య, శ్రీనివాస్, మురళీ, మహేశ్, శ్రీను ఉన్నారు.

కొనసాగుతున్న కంటి వైద్య శిబిరం


ఆపరేషన్లు చేయించుకున్న వారితో సభ్యులు

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో కొనసాగుతున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. శిబిరంలో 550 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి అద్దాలను ఫౌండేషన్ సభ్యుడు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఇప్పటివరకు 4200 మందికి కంటి పరీక్షలు చేయగా.. అందులో 2200 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 120 మందికి శంకర నేత్రాలయ వైద్యులు ఉచితంగా నేత్ర శస్త్రచికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు చంద్రశేఖర్, కొండల్‌రెడ్డి, అభినవ్ రెడ్డి, కొండల్‌యాదవ్, రమేశ్‌నాయక్, మల్లయ్య, శేఖర్, యాదయ్య, శ్రీపతి, తరుణ్‌స్వామి, శ్రీను, మహేశ్, శివ, కళ్యాణ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ డైరెక్టర్‌కు సన్మానం


శ్రీశైలంను సత్కరిస్తున్న కాలనీ వాసులు

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలంను నవయూత్ కాలనీ వాసులు.. ఆదివారం స్థానిక పోచమ్మ ఆలయ వద్ద ఘనంగా సన్మానించారు. కాలనీ వాసులు జానయ్య, బాలరాజు, అశోక్, కృష్ణ, గిరి, మహేశ్, గిరి, నర్సింహ, శ్రీను, ప్రవీణ్, జగదీశ్, మహేందర్, బలరాం, వెంకటేశ్, శివ, వంశీ, ప్రశాంత్, శ్రీకాంత్ ఉన్నారు.

బీజేపీ విజయోత్సవ సంబురాలు

తలకొండపల్లి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే భాగస్వామ్యం మహాయితి కూటమి అఖండ విజయం సాధించడంతో బీజేపీ నాయకులు విజయోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ బక్కి కుమార్ హర్షం వ్యక్తంచేశారు. మోదీ సంక్షేమ పథకాలే.. ప్రజలు ఏకపక్షం తీర్పు ఇచ్చేలా చేశాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాండు, తిరుపతి, పాండు ప్రసాద్, మహేశ్, కుమార్, అనిల్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'సింహగర్జన' వాల్ పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీల రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నాయని తెలంగాణ మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేరా బాలకిషన్ ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల్లో 59 ఉప కులాల మధ్య చిచ్చురాజేస్తున్నారని విమర్శించారు. ఆదివారం స్థానిక కూడలిలో మాజీ సర్పంచ్, సంఘం అధ్యక్షుడు దశరథ, బీజేపీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలతతో కలిసి మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం బాలకిషన్ మాట్లాడుతూ.. డిసెంబర్ 1వ తేదీన నగరంలోని పరేడ్ మైదానంలో నిర్వహించనున్న సభకు మాలలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల, బ్యాగరీ కాటికాపర్ల సంఘం నాయకులు రవి, నాయకులు నరేందర్, శ్రీనాథ్, శ్రీధర్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


వంశీచంద్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ గీత తదితరులు

కడ్తాల్: రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి సూచించారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ నూతన చైర్ పర్సన్ యాట గీత, ఆదివారం వంశీచంద్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పార్టీ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. వంశీ దంపతులను సన్మానించారు. తన నియామకానికి సహకరించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మాడ్గుల నుంచి నలుగురు డైరెక్టర్లు


పల్లె జంగయ్య గౌడ్


సంపత్ కుమార్


జల్ల రమేష్ గౌడ్


ఉడుతల యాదయ్య

మాడ్గుల: ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా మండలం నుంచి నలుగురు ఎంపికయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్లు పల్లె జంగయ్య గౌడ్, సంపత్ కుమార్, జల్ల రమేష్ గౌడ్, ఉడుతల యాదయ్యలను ఆదివారం స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం డైరెక్టర్లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివద్ధికి ఎనలేని కృషి చేశామని, దాని ఫలితమే తమను ఈ పదవులు వరించాయని పేర్కొన్నారు. బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఒడిశా ఎమ్మెల్యేను కలిసిన నాయకులు


లక్ష్మణబాజీని సన్మానించిన పాండు

మంచాల: ఒడిశా ఎమ్మెల్యే లక్ష్మణబాజీని కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం బోడకొండ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు పాండు ఆదివారం ఒడిశాలో కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. ఒడిస్సా సీఎంగా సుదీర్ఘ కాలం పని చేసిన నవీన్‌పట్నాయక్‌ను ఓడించిన సామాన్య నాయకుడు లక్ష్మణబాజీ అని పేర్కొన్నారు. క్రమశిక్షణ, కష్టపడే మనస్తత్వమే ఆయన గెలుపునకు నాంది అని వెల్లడించారు.

నాలుగేళ్లయినా పరిహారం ఎందుకు అందలేదు?

కందుకూరు: నాలుగేళ్ల క్రితం వరదలో కొటుకుపోయి మృతి చెందిన వారి కుటుంబీకులకు ఇంత వరకు పరిహారం అందలేదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. అప్పట్లో మంత్రిగా ఉన్న సబితారెడ్డి ఎందుకు ఇప్పించలేదని ప్రశ్నించారు. ఆదివారం ఆయన మాట్లాడారు. 2020లో వచ్చిన వరదల్లో బాచుపల్లి, బేగంపేటకు చెందిన ఇద్దరు అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలో వరదల్లో చిక్కుకుని మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులకు పరిహారం అందించడంలో నాటి పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. కేంద్రం నుంచి విపత్తు నివారణ ద్వారా వచ్చిన నిధులను దారి మళ్లించి, ప్రభుత్వ ఖజానాను దివాలా తీయించారని విమ ర్శించారు. ఎన్నికల ముందు పరిహారం విడు దల చేస్తున్నట్లు మంజూరు పత్రాన్ని బాధితుల చేతుల్లో పెట్టి మభ్యపెట్టారని పేర్కొన్నారు. ఇప్పు డు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు.

ఆరోగ్యానికి ఉదయం నడక శ్రేయస్కరం

కడ్తాల్: ఆరోగ్యానికి ఉదయం నడక ఎంతో శ్రేయస్కరమని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్ అన్నారు. మండల కేంద్రం బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయి వాకర్స్ ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. ఆయన ఆదివారం డోజర్ సహాయంతో పిచ్చి మొక్కలను తొలగించి, చదును చేయించారు. ఈ సందర్భంగా స్థానికులు నరేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు యాదయ్య, రాజేందర్‌గౌడ్, ఇమ్రాన్‌బాబా, అశోక్ తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి

ఇబ్రహీంపట్నం: డిసెంబర్ రెండో వారంలో ఇబ్రహీంపట్నంలో నిర్వహించే మాదిగ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని మాదిగ జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. మాదిగల హక్కుల సాధనకు, ఐక్యతను చాటేందుకు సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ పాల్గొనున్నారని, మాదిగలు తరలి రావాలని కోరారు. బీజేపీ నాయకుడు ప్రతాప్, బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్, మాజీ సర్పంచ్ బోడకృష్ణ, యాదయ్య, పురుషోత్తం, జంగయ్య ఉన్నారు.

కులగణనకు మరో అవకాశం

తుక్కుగూడ: కులగణన సర్వే చేసుకోని వారికి మరోసారి అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ వాణి తెలిపారు. మిస్ అయిన వారు.. నంబర్ 9010314956లో సంప్రదించాలని సూచించారు.

గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి


నరేశ్‌నాయక్‌ను సన్మానించిన సంఘం నాయకులు

కడ్తాల్: గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలని గిరిజన సేవా సంఘం రాష్ట్ర నాయకులు భూనాథ్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన నరేశ్‌నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు భూనాథ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు హరిచంద్ నాయక్‌లు మాట్లాడుతూ.. గిరిజనులు విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రాణించి, ప్రజలకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీసెల్ అధ్యక్షుడు యాదయ్య, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్, సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్పతినాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యా, నాయకులు శ్రీను, పాండునాయక్, రాజేందర్‌గౌడ్, లక్ష్మణ్ నాయక్, శ్రీనునాయక్, టీక్‌లాల్ నాయక్, ఇమ్రాన్ బాబా, సల్మాన్, మహేశ్, భిక్షపతి, ప్రభులింగం, ఎస్ఎల్ఆర్ లక్ష్మణ్, యాదయ్య తదితరులు ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు


కారును తనిఖీ చేస్తున్న సీఐ కృష్ణంరాజు

యాచారం: రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు హెచ్చరించారు. పీఎస్ పరిధి మీరాఖాన్‌పేట- కుర్మిద్ద గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం వాహనాలను తనిఖీలు చేశారు. లైసెన్స్, ఆర్‌సీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకుని వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అజాగ్రత్త తమను నమ్ముకున్న వారిని రోడ్డున పడేలా చేస్తుందని, బయటకు వెళ్లే ముందు కుటుంబీకులను గుర్తుకుపెట్టుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు సమగ్ర సర్వే


కడ్తాల్: ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 96 శాతం
- మండలంలో 93 శాతం పూర్తి
- కొనసాగుతున్న డేటా ఆన్‌లైన్ ప్రక్రియ

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (సమగ్ర ఇంటింటి కుటుంబ) సర్వే తుది దశకు చేరుకుంది. ఈ నెల 9 నుంచి సర్వే మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. పట్నం మున్సిపాలిటీలో 96 శాతం కులగణన పూర్తయింది. 7,868 ఇళ్లకు గాను ఆదివారం వరకు 7,541 కుటుంబాల వివరాల సేకరణ కాగా.. మిగతా 327 నివాసాలు మిగిలాయి. 102 ఈబీలకు (ఎన్యుమరేటర్ బ్లాక్. ఒక బ్లాక్‌కు 150 ఇళ్ల కేటాయింపు) గాను 78 ఈబీల్లో వంద శాతం సర్వే పూర్తయింది.

మండలంలో 93 శాతం
ఇబ్రహీంపట్నం మండల పరిధి 14 గ్రామ పంచాయతీల్లో 11,151 ఇళ్లను గుర్తించి 93 శాతం కుటుంబ కులగణనను ఎన్యుమరేటర్లు పూర్తి చేశారు. మిగతా నివాసాలను ఈ నెల 28వ తేదీ లోపు పూర్తి చేయనున్నట్లు ఎంపీడీఓ వెంకటమ్మ తెలిపారు. శేరిగూడ సమీపంలోని ఇందు కళాశాలలో సర్వే సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


ఇబ్రహీంపట్నం: గురునానక్ కళాశాలలో ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

సర్వే కోసం సంప్రదించండి
కులగణన కాని వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం 9866683040, 7675829268, 7386704867 నంబర్లను సంప్రదిస్తే.. ఎన్యుమరేటర్లు మీ ఇంటికి వస్తారని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఖానాపూర్ సమీపం గురునానక్ కాలేజీలో సర్వే వివరాల కంప్యూటరీకరణ ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు.

సర్వేకు సహకరించాలి

ఎంపీడీఓ కుసుమమాధురి



ఆమనగల్లు: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ కుసుమమాధురి కోరారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. కులగణన ఈ నెల 26న ముగుస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు 90 శాతం పైగా సర్వే పూర్తయిందని పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు అందుబాటులో లేని కారణంగా.. సమాచారం సేకరించలేకపోయామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ సర్వేలో పాల్గొనాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా 9542135658 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముమ్మరంగా ఆన్‌లైన్ ప్రక్రియ
కడ్తాల్: సమగ్ర కుటుంబ సర్వే సమాచారం ఆన్‌లైన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. ఒక వైపు సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుండగానే, మరో వైపు డేటా నమోదు చురుగ్గా కొనసాగుతోంది. మండలంలో మొత్తం 11,826 కుటుంబాలకు గాను, 11,532 కటుంబాల గణన పూర్తయింది. స్థానిక ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై పాఠశాలలో 42 మంది ఆపరేటర్లు.. ప్రజల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. మండల పరిధిలో కుటుంబ సర్వే 96 శాతం పూర్తయిందని, డేటా నమోదును పర్యవేక్షిస్తున్నామని ఎంపీడీఓ సుజాత తెలిపారు.

యాచారంలో..
యాచారం: మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు ఆదివారం కులగణనకు సంబంధించి సేకరించిన 400 కుటుంబాల వివరాలను కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ప్రక్రియను ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పరిశీలించి, ఆపరేటర్లకు సూచనలు చేశారు.